మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## పాలమూరు నిర్వాసితులకు
# ప్రభుత్వం అండ

**రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



నిర్వాసితుల సమస్యలను ఆలకిస్తున్న జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్

**కొల్లాపూర్, మే 15 ప్రభాతవార్త :** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భూముల కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని వారు అధైర్య పడవలసిన అవసరం లేదని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని బోరబండ తండ, సున్నపు తండా, వద్దే గుడిసెలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పనుల వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భూములు, ఇల్లు కోల్పోయిన బోరబండ తండా, సున్నపు తాండా, వద్దే గుడిసెల ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావుని ప్రజలు అభ్యర్థించారు. నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీళ్ళు వస్తున్నందున సున్నపుతాండాలోని ఇల్లు మునిగిపోయే పరిస్థితులు ఉన్నాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురాగా మంత్రి జూపల్లి కృష్ణారావు అందుకు సానుకూలంగా స్పందిస్తూ ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో ఇల్లు నిర్మించుకునే విధంగా చర్యలు చేపడతామని తెలియజేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన ప్రజలకు పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, ప్రజలు ఎవ్వరూ కూడా అధైర్యపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అందుకు కావలసిన ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారుల మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# డిగ్రీ పరీక్షలు ప్రారంభం

**పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి : వీసీ ఆచార్య జిఎన్ శ్రీనివాస్**



పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీసీ, పియూ పరీక్షల నియంత్రణ అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 15 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2,4,6 రెగ్యులర్ పరీక్షలతో పాటు 1,3,5 బ్యాక్ లాగ్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఉపకులపతి ఆచార్య జిఎన్ శ్రీనివాస్ ఫ్లైయింగ్ స్క్వాడ్స్ కు నియామక పత్రాలు అందజేసి, పరీక్షలు నిర్వహణలో ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పాత్ర ముఖ్యమైనదని, చీఫ్ సూపరింటెండెంట్స్, ఇన్విజిలేటర్స్ సమన్వయంతో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి పరిస్థితులను కల్పించాలని అన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి డా. కే ప్రవీణ , అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా. శాంతి ప్రియ, అసిస్టెంట్ పరీక్షల నిర్వహణ అధికారులు డా అరుంధతి , డా. బైరి సురేష్ వీసీతో పాటు ఉన్నారు.

# మూడంచెల బందోబస్తు..

- నేడు సాయంత్రం ప్రపంచ సుందరీమణుల పర్యటన
- భద్రతా విధుల్లో 980 పోలీసులు
- పిల్లలమర్రి వద్ద ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ జానకీ



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ ధరావత్

4

# పాలమూరు జరూర్ ఆనా..



పాలమూరు పేరు ప్రఖ్యాతలు విశ్వవ్యాప్తం కానున్నాయి ప్రసక్తిగాంచిన కోహినూర్ డైమండ్ సహా గోల్కొండ వజ్రాలు సైతం పాలమూరు ప్రాంతాల నుంచి వచ్చాయంటే అతిశయోక్తి కాదు. అంతటి గొప్ప చరిత్రను కలిగిన ఈ ప్రాంతానికి మరో అరుదైన గౌరవం దక్కనుంది. ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన పిల్లలమర్రి భారతదేశంలోని అతి పెద్ద మహా వృక్షాలలో మూడవది. ఈ మహావృక్షం తన వేళ్ళలో మరొక అరుదైన రికార్డును ఇనుమడింప చేసుకోనున్నది. నేడు అనగా ఈనెల 16న ప్రపంచ సుందరిమణులు (మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు) పాలమూరు జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లల మర్రికి రానున్నారు. ఈ సందర్భంగా పాలమూరు ప్రత్యేకత, పిల్లలమర్రి ప్రాశస్త్యంపై ప్రత్యేక కథనం.

*మహబూబ్‌నగర్ బ్యూరో, మే 15 ప్రభాతవార్త:*

- పిల్లల మర్రి సందర్శనకు ప్రపంచ సుందరిమణులు
- నేడు మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు రాక
- ఏడు శతాబ్దాల చరిత్ర గలిగిన మహావృక్షం
- విశ్వవ్యాప్తం కానున్న పాలమూరు ఖ్యాతి

### 700 ఏండ్ల చరిత్ర..

మహబూబ్‌నగర్‌ను గతంలో రుక్మాపేటగా పిలిచేవారు. నిజాం కాలంలో 1980లో మహబూబ్‌నగర్‌గా పేరు మార్చారు. ప్రసిద్ధ కోహినూర్ డైమండ్‌తో పాటు ప్రముఖ గోల్కొండ వజ్రాలు ఇక్కడి నుంచి వచ్చాయని చరిత్రక ఆధారాలు ఉన్నాయి. గతంలో చోళవాడి చోళుల భూమి అని కూడా పిలువబడింది. పాలమూరు నుంచి కృష్ణ తుంగభద్ర నదులు ప్రవహిస్తాయి. అంతేకాదు సుమారు 7 శతాబ్దాల చరిత్ర కలిగి తన వేర్లు మొదలు ఎక్కడో నేటికి గుర్తించలేని ఓ మహా వృక్షం ఈ ప్రాంత కీర్తిని మరింత పెంచుతున్నది. మహబూబ్‌నగర్ పట్టణానికి సుమారు నాలుగున్నర కిలోమీటర్ల దూరంలో నాలుగు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పిల్లలమర్రి మహావృక్షం రమణీయమైన ప్రకృతి క్షేత్రంలో ఉన్నది. ఇంతటి చారిత్రక ప్రాశస్తం పొందిన మర్రిచెట్టును చెదపురుగులు తొలిచి వేయడంతో 2017 డిసెంబర్‌లో ఒక కొమ్మ విరిగిపడింది. దీంతో చెట్టు వద్దకు సందర్శకులను అనుమతించడం ఆపేశారు. ప్రజలు చెట్టు వద్దకు వచ్చినా దాన్ని తాకకుండా ఉండేలా చుట్టూ ప్రహరీ నిర్మించారు. చెట్టును చూడాలనుకునే సందర్శకుల కోసం సమీపంలో ఒక ఫుడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు దానిపై నుంచే చూసేలా ఏర్పాట్లు చేసి ఆ తరువాత చెద పురుగులు లేకుండా చేసేందుకు క్లోరోఫైరీ ఫస్ దావణాన్ని తొర్రల్లోకి పంపించారు. అందుకు సెలైన్ బాటిల్లను వాడారు. చెట్ల కొమ్మలకు డ్రిల్లింగ్ చేసి ద్రావణం వెళ్లేలా ఏర్పాటు చేసి జీవం పోశారు. పిల్లలమర్రి మహావృక్షం ప్రతికూల పరిస్థితులను తట్టుకొని మళ్లీ జీవం పోసుకున్నది. ఒదిగిన చోటే ఎదిగి తిరిగి చిగురించి తన చారిత్రక ఆనవాళ్లకు సజీవ సాక్షంగా నిలుస్తున్నది. భారతదేశంలోనే అతిపెద్ద మర్రి చెట్లల్లో ఇది ఒకటని తెలంగాణ అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మొదట ఈ చెట్టును పీర్ల మరిగా పిలిచేవారు క్రమంగా పిల్లలమర్రిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. చెట్టు షాకో శాఖలుగా విస్తరించడంతో దీని మొదలు ఎక్కడ అనేది తెలుసుకోలేనంతగా మారింది.

### 16వ శతాబ్దం నాటి శ్రీ రాజరాజేశ్వరి ఆలయం..

శ్రీ రాజరాజేశ్వరి ఆలయం కృష్ణానది తీరంలోని ఈర్ల దిన్నె గ్రామంలో ఉండేది. శ్రీశైలం డ్యాం నిర్మాణ సమయంలో ఏర్పడిన ముంపునకు గురైన నేపథ్యంలో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాన్ని పరిరక్షించే ఉద్దేశంతో 1983లో పిల్లల మర్రి పురావస్తు ప్రదర్శనశాల ప్రాంగణానికి తరలించి అధునాతన పునాదులపై 1983లో తిరిగి పున: ప్రతిష్టించారు. విజయనగరం వాస్తు శైలిలో నిర్మించిన ఈ ఆలయం 16వ శతాబ్దానికి చెందినది. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పురావస్తు ప్రదర్శన శాఖలో జిల్లాకు చెందిన పలు గ్రామాలు పట్టణాల్లో సేకరించిన శిల్పాలు శాసనాలు రాతియుగపు పనిముట్లు హైదరాబాద్ స్టేట్ మ్యూజియం నుంచి సేకరించిన పంచలోహ విగ్రహం పిల్లల మర్రి ప్రదర్శనశాలలో ఉంచారు. పిల్లల మర్రిలోని శిల్ప విశిష్టత చూపరులకు కనువిందు చేస్తుంది. సందర్శకులకు విజ్ఞానంతోపాటు వినోదాలతో పాటు ఆధ్యాత్మిక చింతనతో కూడిన ప్రశాంతతను కూడా కల్పిస్తుంది. పిల్లల మర్రిలో ప్రదర్శించిన శిల్పాలు మహబూబ్‌నగర్ జిల్లాలోని అల్వాల్ పల్లి, గొల్లంతగుడి, పూడూరు, నంది వడ్డెమాన్, పానగల్, కల్వకోల్ ప్రాంతాలకు చెందినటువంటి హిందూ బౌద్ధ జైన మతాలకు సంబంధించిన ప్రతిమలు. అలాగే అమ్రాబాద్ త్రవ్వకాల్లో లభించిన పాత రాతియుగం పనిముట్లు నవీన శిలా పనిముట్లు బృహ శిలాయుగపు కొండలు, పాత్రలు, విజయనగర కుతూబ్‌షాహీల కాలంనాటి ఆయుధాలు విగ్రహాలు ఎన్నో ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు.



### పిల్లల మర్రిలో మరెన్నో....

పిల్లలమర్రి శిల్ప విశిష్టత చూపనులను కనువిందు చేస్తుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ ఆధ్వర్యంలో పిల్లల మర్రిలో జిల్లా మ్యూజియం ఏర్పాటు చేశారు. శాతవాహనుల నుంచి అసఫ్జాహీ రాజుల వరకు ముద్రించిన నాణెములు ఇక్కడ ప్రదర్శించిన వాటిలో ప్రముఖమైనవి. పిల్లలమర్రిలో ఇంకా ఎన్నో విహారయాత్రకు వచ్చే వారి కోసం ఇక్కడ మినీ జూ పార్కు ఉంది. రకరకాల పక్షులు నెమలిలు, కుందేళ్లు, కోతులు వివిధ రకాలకు చెందిన ఎక్వేరియం కూడా పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఇక్కడే జింకల పార్కు కూడా ఉన్నది.

### రెండు గంటల పాటు పర్యటన..

పాలమూరు అంటేనే తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు చరిత్రకు నిలువెత్తు నిదర్శనం. ఇంతటి ప్రఖ్యాతలు సాధించిన ఆలయాలు పర్యాటకంగా ఎరుగాంచిన ప్రాంతాలను తనివితీరా పరిశీలించేందుకు ప్రపంచ సుందరిమణులు పాలమూరుకు తరలిరావడం ఇక్కడి గొప్పతనానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రపంచ సుందరిమణులు (మిస్ వరల్డ్ 2025 పోటీదారులు) శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గంలో 16న సాయంత్రం ఐదు గంటలకు పిల్లలమర్రి చేరుకుంటారు. అక్కడే సుమారు రెండుగంటల పాటు చారిత్రక ఆలయాలను జిల్లా మ్యూజియంతో పాటు పిల్లలమర్రి చరిత్రను వాటి ప్రాశస్త్యాన్ని తెలుసుకుంటారు. పాలమూరు వారసత్వాన్ని సాంస్కృతిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా పర్యాటకశాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచ సుందరిమణులు పిల్లలమర్రి పర్యటనకు వచ్చిన సందర్భంగా ఇక్కడ చరిత్రను పిల్లలమర్రి ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యాచరణ చేపట్టింది.

### పకడ్బందీ ఏర్పాట్లు..

అందాల భామల పర్యటనకు సంబంధించి మహబూబ్‌నగర్‌జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి తర్వాత ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో పాటు ఏర్పాట్లను చేస్తున్నది. ఇప్పటికే ఐజి సత్యనారాయణ, జోగులాంబ జోన్ డిఐజి ఎల్‌హెచ్ చౌహాన్ సహా జిల్లా అధికారులు అదనపు కలెక్టర్లు పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. వెయ్యి మందికి పైగా పోలీస్ అధికారులు సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశారు. వారికి ఎక్కడ ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీరి పర్యటనను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నది. మిస్ వరల్డ్ పోటీలో నేపథ్యంలో ప్రతి అంశం లోను తెలంగాణ క్యాంతి ప్రతిబింబించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. "తెలంగాణ జరూర్ ఆనా " అనే థీమ్ తో ప్రభుత్వం అందాల భామలు, ప్రాచీన ఆలయాలు పర్యాటక ప్రాంతాల అందాలు తిలకించేలా ప్రణాళికలు రచించింది. తద్వారా పాలమూరు ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. వీటన్నింటిని తిలకించే అందాల భామలు మంత్రముక్తులు కావడం తథ్యం. ఓవైపు ప్రపంచ సుందరిమణుల పర్యటన విజయవంతం చేసేందుకు అధికారులు సకల ఏర్పాట్లు చేస్తుంటే మరోవైపు ప్రజానీకం మాత్రం అందాల భామలను చూసేందుకు వేయి కనులతో ఎదురుచూస్తున్నారు. అందుకే "పాలమూరు జరూర్ ఆనా "...

# సుశిక్షితులైన వైద్యులుగా తయారు కావాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు**

**నారాయణపేట టౌన్,మే 15 ప్రభాతవార్త :** వైద్య వృత్తి ఎంతో పవిత్ర మైనదని, వైద్య విద్యను అభ్యసించే అవకాశం రావడం గర్వకారణమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా గురువారం ఆయననారాయణపేట జిల్లా పర్యటనకు వచ్చారు. ముందుగా నారాయణపేట మండలం అప్పక్ పల్లి గ్రామ సమీపంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించగా కళాశాల వద్ద సీ.ఎస్ రామకృష్ణారావుకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. రామ్ కిషన్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. తర్వాత పోలీసులు ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం మెడికల్ కళాశాలలో మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులతో సీఎస్ ఇంట్రాక్ట్ అవుతూ కళాశాలలో చదువు కోవడం ఎలా అనిపిస్తుందని విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాతో తనకు అవినాభావ సంబంధం ఉందని, పాలమూరు జిల్లాలో 1996 లో పని చేశానని తెలిపారు. జిల్లాలో రెండు పెద్ద నదులు కృష్ణా, తుంగభద్ర ఉన్నాయని, జిల్లాకు వెనుక బడిన జిల్లాగా పేరు ఉండేదని చెప్పారు. పాలమూరు జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన నారాయణపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత ఈ జిల్లా సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా ముందున్నారన్నారు. చివరగా ఏర్పడిన జిల్లా కాబట్టి సమస్యలు ఉంటాయని కానీ వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలన్నారు. ఇంత చక్కటి మెడికల్ కళాశాలలో అన్ని వసతి సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు మంచిగా చదువుకుని తల్లిదండ్రుల కలను నెరవేర్చాలని సూచించారు. కళాశాల నుంచి సుశిక్షితులైన వైద్యులుగా తయారై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. మెరుగైన సేవలు అందించినప్పుడే వృత్తికి న్యాయం చేసిన వాళ్లం అవుతాం అన్నారు. 34 ఎకరాలలో ఉన్న మెడికల్ కళాశాలలో నర్సింగ్, ఎంసిహెచ్, హాస్టల్స్ నిర్మాణం తర్వాత ఇదో మెడికల్ సిటీగా మారుతుందని చెప్పారు. ఈ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లి పని చేసినా నారాయణ పేట మెడికల్ కళాశాలలో చదువుకున్నాం అని గర్వంగా చెప్పుకునే విధంగా ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం సీఎస్ రామకృష్ణారావు కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో కళాశాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో కళాశాల నిర్వహణ, ఇతర వసతి సౌకర్యాల గురించి చర్చించారు. నర్సింగ్ కళాశాల, ఎంసిఎచ్ నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలని టిజిఎం ఎస్ఐడిసి అధికారులను ఆదేశించారు. వాటితో పాటు సిసి రోడ్లు, పార్కింగ్, మార్చురీ, పరికరాలు, ఇతర అదనపు భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలని -మిగతా4లో..



మాట్లాడుతున్న సిఎస్ రామకృష్ణారావు

## భావితరాలకు
# మీరు దిక్సూచి

- ఎమ్మెల్యేగా విజయం సాధించిన దానికంటే కూడా ఈ రోజు సంతోషంగా ఉంది : యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- చిన్న ప్రోత్సాహం ఇస్తేనే ప్రపంచానికే విస్మయం కలిగించేలా ఫలితాలు సాధించారు
- కార్పోరేట్ స్థాయి ర్యాంకులు సాధించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు
- ఘనంగా జరిగిన విద్యా ఉత్సవాలు
- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి





మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 15 ప్రభాతవార్త :** భావితరాలకు మీరు దిక్సూచి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎప్‌సెట్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం పయోనీర్ పేరుతో ఉచిత ప్రత్యేక కోచింగ్ అందించారు. ఉచిత కోచింగ్ తీసుకుని, ఉత్తమ ర్యాంకులు సాధించిన 114 మంది విద్యార్థులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంవత్సర కాలం పాటు నేను కన్న కలలు ఫలించాయని, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పోరేట్ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులతో పోటీ పడి మంచి ర్యాంకులు సాధించారని, ఇంతకుమించిన ఆనందం ఏమి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఈ ర్యాంకులు సాధించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన చెప్పారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన సంతోషం కంటే కూడా ఈ రోజు 114 మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినందుకు తనకు కలిగిన సంతోషం ఎక్కువ అని ఆయన చెప్పారు. ఉచిత కోచింగ్ తీసుకుని ఈ రోజు ఉత్తమ ర్యాంకులు సాధించిన ఘనత విద్యార్థులతో పాటు అందరి సమిష్టి కృషి అని ఆయన తెలిపారు. విద్యార్థులు సాధించిన ఈ ర్యాంకులతో వారి తల్లిదండ్రుల గుండెల్లో సంతోషం నింపినారని, వారికి మరింత ప్రోత్సాహం ఇస్తే, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్‌లో మంచి మార్పు మొదలైందని, ఈ మార్పు ఇలాగే కొనసాగించాలన్నారు. మన పాలమూరు -మిగతా4లో..

# డిపిఆర్ లేకుండా కొడంగల్ ప్రాజెక్టు నిర్మాణం ఎలా చేపడతారు

- రూ.100కోట్లకు తూట్లు పొడుస్తున్న ప్రభుత్వం
- ప్రజాభిప్రాయం లేనిదే
- ప్రాజెక్టు నిర్మాణం పనులు ప్రారంభించొద్దు
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఫైర్



మాట్లాడుతున్న బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం

**మక్తల్ టౌన్, మే 15 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణం లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసుకున్న విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ప్రజల్ని మభ్యపెట్టి రూ.100 కోట్ల కోడంగల్ ప్రాజెక్ట్ పై బిల్లులు ఎలా చెల్లిస్తారని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. ప్రాజెక్టు అనుమతులు లేకుండా డిపిఆర్ లేకుండా బిల్లులు ఎలా పెడతారన్నారు. గతంలో ఇచ్చిన ప్రాజెక్టులకు ఈ రోజుకి కొన్ని గ్రామాలైన అనుగొండ అంకెన్ పల్లి గ్రామాలవారికి డబ్బులూ ఇంకా వస్తానే ఉన్నవి. ఈరోజు మీరు కొడంగల్‌కు నీరు తరలించుకు పోవడాన్ని అలాగే అనుసరించే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలియజేశారు. జూరాలలో ప్రస్తుతం నిల్వసామర్థం కేవలం 7టీఎంసీల ఒకప్పుడు 10 టిఎంసిల నీరు రైతులకు ప్రజలు తాగడానికి నీళ్ల లేక ఇక్కట్లు పడుతున్నారని, రాబోయే నెలలో ఇంకా నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని ముందు చూపుతో నీటి నిలువ సామర్థ్యాన్ని నిలుపుకొనే విధంగా చూడాలని అన్నారు. మన ప్రాంతంలోని కొల్లాపూర్ ఏరియాకు నీటికి గండి కొట్టడాన్ని తప్పు పట్టారు. మన రైతు లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన దగ్గర ఉన్న తక్కువ సామర్థ్యం ఉన్న భూత్పూర్ రిజర్వాయర్ నుండి కొడంగల్‌కు నీటిని ఎలా తరలిస్తారని రైతులకు తెలియకుండా ప్రజలకు మాయమాటలు చెప్పి డీపీఆర్ లేకుండా తీసుకుపోతే సహించబోమన్నారు. కావాలంటే సంగం బండ రిజర్వాయర్ నుండి తీసుకు వెళ్లే ప్రయత్నం చేయండి కానీ ఈరోజు చుక్కనీరు లేని భూత్పూర్ రిజర్వాయర్ నుండి నీరు తీసుకుపోతామనడం అనుభవం లేని పని అని అన్నారు. ఎక్కడా లేని నాణ్యమైన మోటార్ పంపులు మన దగ్గర ఉన్నాయని వాటిని రైతులకి మాత్రమే వాడుకోవాలని ఇతరత్రా వేరే ప్రాంతాలకు తరలించడానికి మాత్రం కాదని తెలియజేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రతి గ్రామంలో తీసుకున్న తర్వాతనే ప్రాజెక్టు పనుల నిర్మాణం చేపట్టాలని భూ సేకరణ విషయం లో రైతులకు కనీస ధర వచ్చేదాకా ప్రజా భిప్రాయం తీసుకొని గ్రామ గ్రామాన అభిప్రాయ సేకరణ చేయండని అన్నారు. అన్ని మండలాల కన్నా ప్రత్యేకంగా నర్వ మండలానికి అధిక నష్టము ఉందని అన్నారు. స్టాండ్ బై పంపూ వున్నది దూర దృష్టితో పెట్టింది కోడంగల్‌కు నీరు తరలించడానికి కాదనీ మా ప్రాంతపు రైతులకు పంటలు పండించు కోవడం కోసం మాత్రమేనన్నారు. సిడబ్లుసి నుండి అనుమతులు ఐతేనే నీరు తీసుకెళ్ళండని అన్నారు. అనుమతులు లేని ప్రాజెక్టుల బిల్లులు ఎలా పెడతా రనీ ప్రస్తుత నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకు మార్ రెడ్డిని సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. బిల్లుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగినా దీనికి పూర్తి బాధ్యత ఆ మంత్రి తీసుకోవాలన్నారు. అధికా రులతో కుమ్మక్కై పనులు ప్రారంభిస్తే సహించమని అన్నారు. ఆత్మకూరుకు రెవెన్యూ డివిజన్ పెట్టింది 2015లోనే రెవెన్యూ డివిజన్ పునాదులు పడ్డాయ న్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఉన్న అన్ని పంచాయ తీలకు డబ్బులు రాక పంచాయతీ కార్యదర్శిలు కొట్టుమిట్ట లాడుతున్నారని ఫాలో వర్గం లేక పల్లెలు పడక ఏసాయని గుర్తు చేశారు. భారతదేశంలోని డబ్బులు రాని పంచాయతీలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి అని అంటే అది తెలంగాణ రాష్ట్రంలోనే అన్నారు. సొంతగా నేనే గత నెల 28న ప్రభుత్వానికి వడ్లు అమ్మాననీ మాకే డబ్బులు రాలేదని వేసిన వడ్లకే డబ్బులూ లేవు బోనస్‌కు అసలే దిక్కులేదన్నారు. ఇప్పటికైనా గ్రహించి అనుభవజ్ఞులతో చర్చించి అటవీ శాఖ అనుమతులు తప్పని సరిగా తీసుకొని రైతుల అభిప్రాయ సేకరణ ప్రతి గ్రామంలో తీసుకొని తర్వాత పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ చైర్మన్లు నరసింహగౌడ్, రాజేష్ గౌడ్ ,బిఆర్ఎస్ పార్టీ మక్తల్ టౌన్ అధ్యక్షులు జుట్ల చిన్న హనుమంతు, నర్వ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, బీ ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాసులుగుప్తా, ఊట్కూరు మాజీ జెడ్పిటిసి అశోక్ గౌడ్, గాల్‌రెడ్డి, అరవింద్ ,జుట్ల శంకర్, మాజీ కౌన్సిలర్లు జగ్గలి రాములు మొగులప్ప శివారెడ్డి జుట్ల సాగర్, ఎలిగండ్ల బాలప్ప పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**అమరచింత మే 15. ప్రభాతవార్త :** అమరచింత మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం మండల తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో మండల తహసిల్దార్ రవికుమార్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కేజీ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, విష్ణు, హనుమంతునాయక్, శ్యాంకుమార్, బీసీ రెడ్డి, వెంకటయ్య, తౌఫిక్, అష్షు, దేవరాజ్, బాలరాజ్, రాకేష్ గౌడ్, హరీష్‌నాయక్, వెంకట్‌రెడ్డి, చెన్నారెడ్డి, పల్లె వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

**గద్వాల, మే 16,ప్రభాతవార్త:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 17వ శనివారంజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గల ప్రభుత్వ ఐటిఐ నందు శనివారం ఉదయం 10:00 గంటలకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, జాబ్ మేళాలో ప్రముఖ కేఎల్ గ్రూప్ వారి ఎస్.కె. సేఫ్టీ వింగ్ వారు పాల్గొని తమకు అవసరమైన అభ్యర్థులను ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ డిప్లమా గల బాల బాలికలు జాబ్ మేళాలో పాల్గొని తమ అర్హతల మేరకు ఉపాధి అవకాశాలు పొందవచ్చుని తెలిపారు. జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక ప్రతి జిరాక్స్ కాపీలను తీసుకురావాలని, ఇట్టి అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9110523925; 8341441763 సంప్రదించాలన్నారు.

## కూచూరు కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

### పార్టీకి తీరని లోటు.. పార్టీ నాయకులు..

**నవాబుపేట, మే 15 ప్రభాతవార్త :** కాంగ్రెస్ సీనియర్ నాయకుని మృతి పార్టీకి తీరని లోటు అని మండల పరిధిలోని కూచూరు గ్రామ కాంగ్రెస్ నాయకులు సలేంద్రపల్లి యాదయ్య కాంగ్రెస్ సీనియర్ నాయకుని మృతికి కూచూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సలేంద్రపల్లి యాదయ్య గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి తన వంతు పార్టీ బలోపేతానికి కృషి చేశారు. జడ్చర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి అతి ప్రీతిపాత్రుడైన యాదయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతి బీద కుటుంబంతో ఇద్దరు కుమార్తెలను అతి కష్టం మీద బతుకు సాగదీస్తూ ఈనెల 2తారీఖున ప్రమాదవశాత్తు నిద్రమత్తులో మిద్దెపై పడుకొని కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో కింద పడిపోయాడు. హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ 13వ తారీకు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వైద్యఖర్చుల నిమిత్తం అవసరాల నిమిత్తం తన వంతు సహాయంగా కొంత నగదును పంపించడం జరిగింది. ప్రస్తుతం సలేంద్రపల్లియాదయ్య కుమార్తెలు దయనీయస్థితిలో ఉన్నారని యాదయ్య కుమార్తెల ఆర్థిక పరిస్థితుల నిమిత్తం దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


యాదయ్య (ఫైల్)

## ఏకలవ్య గిరిజన గురుకుల (బాలుర)

## కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోండి

**బాలానగర్, మే 15 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్ర సమీపంలోని ఏకలవ్య గురుకుల గిరిజన బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ సుభాష్ చంద్ర శుక్ల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, బాలానగర్ మండలాలలో ఏర్పాటు చేయబడ్డ ఏకలవ్య మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తరగతులలో 95 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇటీవల పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పదవ తరగతిలో వచ్చిన జిపిఎ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. మొత్తం 95 సీట్లు ఉన్నాయని ఈ నెల 26వ తేదీన కౌన్సిలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 24వ తేదీన కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు విద్యార్థులు 26వ తేదీ ఉదయం 10 గం.లకు కళాశాలకు చేరుకోవాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం ఈ క్రింది ఫోన్ నెంబర్లు సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు. ఫోన్ నెంబర్లు 9415 606618, 9855737578 సంప్రదించాలని కోరారు.

## క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

**మక్తల్, మే 15 ప్రభాతవార్త:** సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో స్థానిక సాయి జ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 1 నుంచి నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు గురువారం ఆయన తన సొంత ఖర్చుతో రూ. 20వేలు విలువ గల క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా శాఖ ఆధ్వర్యంలోని శిక్షణ శిబిరానికి ధీటుగా తన ఆధ్వర్యంలో దాదాపు 75 మంది క్రీడాకారులకు వాలీబాల్, సైక్లింగ్, ఖోఖో, టెన్నికాయిట్ విభాగాల్లో మెరుగైన శిక్షణ అందిస్తున్నామన్నారు. వీరిలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి త్వరలో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు సన్నద్ధం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు రాఘవేందర్, రమేష్ కుమార్, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు సమత, అంజలి, మహేశ్వరి, వెంకటేష్, గౌతమ్, మోహన్, దీక్ష, అఖిల, శ్రీ వర్ష, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన దృశ్యం

## అర్థవంతమైన విద్య బోధనతోనే

## ఉత్తమ ఫలితాలు : డీఈవో ఏ.రమేష్ కుమార్

**బిజినపల్లి, మే 15 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అర్థవంతమైన విద్యబోధన చేపడితేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని డీఈవో ఏ. రమేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ తరగతులను గురువారం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మిరాజుల్లా ఖాన్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు పెంపొందించేందుకు చేపట్టిన వృత్యాంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరగతి గదిలో మారుతున్న పాఠ్యాంశాల ఆధారంగా బోధన నైపుణ్యాలను మెరుగుపర్చుకొని బోధన చేపట్టడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుతారని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యత శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కుర్మయ్య, ఎంఈవో రఘునాథ్ శర్మ, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, డీఆర్పీలు, సీఆర్పీలు మల్లేష్, శేఖర్, సాంబశివుడు, బాలయ్య, మురళి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో

## ధాన్యం తరలింపులో లారీల సమస్య

## లేకుండా చూసుకోవాలి : అదనపు కలెక్టర్

**వనపర్తి టౌన్, మే 15 ప్రభాతవార్త:** ధాన్యం తరలింపులో లారీల సమస్య లేకుండా చూసుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ కార్యాలయంలో గురువారం డిప్యూటీ సుపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, డిస్ట్రిక్ట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల సంస్థ, డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్ (డిఆర్డిఓ), డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ల తో మాట్లాడి ప్రతి సెంటర్‌కు లారీలు పెట్టాలని, ధాన్యం తరలింపులో లారీల సమస్య లేకుండా చూసుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. లేనిపక్షంలో కాంట్రాక్ట్ లైసెన్స్‌ని రద్దు చేస్తామని వారిని హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా వరి ధాన్యం తరలింపుకు అదనపు లారీలు ఏర్పాటు చేయవలసిందిగా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారికి అదేశాలు జారి చేశారు. ఎవరైనా లారీలు పెట్టడానికి ఇబ్బంది కలిగిస్తే జిల్లా సుపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేయగలరని ఈ సందర్భంగా అదేశించారు.


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

# అన్నదాతల అవస్థలకు కారణం బిఆర్ఎస్ పార్టీనే

- రేకుల షెడ్డుకు రైస్ మిల్లు అని అనుమతులు ఇచ్చిన ఘనత ..
- 150 రైస్ మిల్లులు నేడు బ్లాక్ లిస్టులో ఉన్నాయంటే ఆ పాపం మీది కాదా
- అన్నదాతల అవస్థల పట్ల స్పందిస్తూ అధికారులను అనుక్షణం పర్యవేక్షిస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి ప్రతినిధి, మే 15 ప్రభాతవార్త:** తెలంగాణలోని అన్నదాతల కష్టాలకు కారణం బీఆర్ఎస్ పార్టీనేనని వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్లపై మాజీ మంత్రి మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందని గత పదేళ్లగా ఇష్టానుసారంగా వ్యవహరించి నాడు రేకుల షెడ్డులకు రైస్ మిల్లులుగా అనుమతులు ఇచ్చి, నేడు 150 రైస్ మిల్లులను బ్లాక్ లిస్టులో చేర్చిన ఘనత మాజీ మంత్రిది కాదా అని ప్రశ్నించారు. వనపర్తి జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పనులు ఎంతో చురుగ్గా కొనసాగుతున్నాయని, 300లారీలతో నిత్యం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాల సేకరణ జరుగుతుందని తెలిపారు. 200ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్న, ఏసీ రూముల్లో కూర్చొని ప్రెస్ నోట్లు రిలీజ్ చేయడం కంటే నిజా నిజాలను అధికారుల వద్ద తెలుసుకొని ప్రెస్‌నోట్ రిలీజ్ చేస్తే బాగుంటుందని సూచించారు. హమాలీల ఇబ్బంది ఉన్న ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కొంతమంది హమాలీలను సొంతంగా ఏర్పాటు చేసి రైతులకు ఎక్కడ ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నామని వారు వివరించారు. రైతుల ముసుగు తొడుక్కున్న కొందరు బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని అబాసుపాలు చేయాలన్న ఉద్దేశంతో ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో సన్నరకం వడ్లకు ప్రభుత్వం బోనస్ ఇస్తోందని, దీంతో నిజమైన రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వారు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షిస్తున్నారని అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సైతం చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి నిత్యం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. నాడు వరివేస్తే ఉరి అన్న పరిస్థితుల నుంచి నేడు వరి వేస్తే “సిరి“ అనే విధంగా పరిస్థితులు మారాయని గుర్తుచేశారు. యూరియా కోసం రైతులు క్యూ లైన్ లలో నిలబడి చనిపోతే సినిమా హాళ్ల ముందు లైన్లో నిలబడి చనిపోతే సినిమా హాలు వాడిదా తప్పు, మీటింగ్ వచ్చిన రైతు చనిపోతే మీటింగ్ వారిదా తప్పు అని రైతులను అవమానపరిచిన మీరు నేడు నీతులు వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రపంచ సుందరీమణుల మీద ఉన్న ధ్యాస రైతుల మీద లేదు అన్న మాజీ మంత్రి ప్రపంచ సుందరీమణులకు ఆతిథ్యమిచ్చిన హైదరాబాదును ప్రశంసించకపోగా విమర్శించడం పట్ల మీ కుంచిత బుద్ధి ప్రజలకు అర్థమవుతుందన్నారు. మహిళలను కించపరిచి మెట్టు దెబ్బలు తిన్నవారు సినీ తారల కుటుంబాలలో చిచ్చుపెట్టి కూల్చిన వారు మీరే అన్న సంగతి మరచిపోవద్దని అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, పెబ్బేరు మండల మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, పిసిసి సభ్యులు శంకర్ ప్రసాద్, పెద్దమందడి మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, పెబ్బేరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, గోపాల్‌పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ సత్య శీలారెడ్డి, పెబ్బేరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకట్రాములు, శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీహరి రాజు, వనపర్తి మండల అధ్యక్షులు రవికిరణ్, ఖిల్లా ఘణపురం మండల నాయకులు రవినాయక్, యుగంధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

## విద్యార్థులకు మహిళా సాధికారత, హక్కుల పరిరక్షణపై అవగాహన

**గద్వాల,మే 16,ప్రభాతవార్త:** గద్వాల ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమంను కోర్స్ డైరెక్టర్ వెంకట నర్సయ్య ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మహిళా సాధికారత, హక్కుల పరిరక్షణ సమాజంలో లింగ సమానత్వంపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సఖి స్టాఫ్ సెంటర్ సేవలపై సమగ్ర వివరణ ఇచ్చారు. మహిళలు ఎటువంటి హింస, వేధింపులు, చట్టవిరుద్ధ చర్యలు ఎదుర్కొన్నప్పుడు వారికి ఓఎస్సి ద్వారా అందే సహాయాలు, న్యాయ పరిరక్షణ విధానాల గురించి వివరించారు. అదేవిధంగా, గృహహింస నిరోధక చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్స్ ఫ్రమ్ డోమెస్టిక్ వైయలెన్స్ యాక్ట్, మహిళల హక్కులు, బాలికల విద్య, ప్రాముఖ్యత గురించి లోతుగా తెలిపారు. బాలికలు విద్య పొందటం ద్వారా, తమ జీవితాలను స్వయం నియంత్రణతో నడిపించుకునే శక్తిని పొందుతారనే విషయాన్ని ఈ సందర్భంగా హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో తక్షణ నిర్ణయాల, దుష్పరిణామాలు గురించి కూడా ప్రత్యేకంగా అవగాహన కల్పించబడిందన్నారు. ఉద్రిక్తత, ఒత్తిడి లేదా సరైన సమాచారం లేకుండా తీసుకునే తక్షణ నిర్ణయాలు వ్యక్తిగత జీవితంలోనూ, కుటుంబం, సమాజంలోనూ నెగటివ్ ప్రభావాలను కలిగిస్తాయని హెచ్చరిక చేశారు. ముఖ్యంగా క్షణిక ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు, మానసిక ఒత్తిడికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. వాటి వల్ల బాధితులపై నష్టాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సఖి ఓఎస్సి ఇంచార్జ్ శోభారాణి, కేస్ వర్కర్ స్వాతి, ఐటీ స్టాఫ్ జుబేర్, అలాగే గద్వాల టౌన్ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.


అవగాహన సమావేశంలో
మాట్లాడుతున్న సఖి సెంటర్ నిర్వాహకురాలు శోభారాణి

## వరి ధాన్యం కొనుగోలుని ప్రభుత్వం వేగవంతం చేయాలి

**అమరచింత, మే 15 ప్రభాతవార్త;** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిఎస్ గోపి, రైతు సంఘం జిల్లా కోశాధికారి, బి. వెంకటేష్ , తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ఎస్. అజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అమరచింత మండలంలోని కొంకనివాని పల్లె గ్రామంలో వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం సన్న వరి ధాన్యానికి 500 బోనసిస్తున్న ప్రభుత్వం అలాగే వరి ధాన్యం హంసకు బోనస్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రైతులు వరి ధాన్యాన్ని విక్రయించడానికి మిల్లర్ల దగ్గరికి వెళితే తరుగు ధాన్యం ఉందనే సాకుతో క్వింటాలుకు 8 కేజీలు రైతుల దగ్గర తీసుకుంటున్నారని రైతులను మోసం చేస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆకల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని అలాగే వర్షాలకు ధాన్యం తడవకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని ఈ సమ్మెలో రైతులు కూలీలు భారీగా పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, అంజిరెడ్డి, మొగిలి, మోహన్, నాగరాజ్, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.


అమరచింత మండలంలోని కొంకనివాహి
పల్లె గ్రామంలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

## బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడమే మన లక్ష్యం

**వనపర్తి,మే 15 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చే లక్ష్యం దిశగా అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం జరిపించాలని బాలల పరిరక్షణ అధికారి ఎం రాంబాబు విజ్ఞప్తి చేశారు. మహిళాఅభివృద్ధి శాఖ జిల్లా బాలల పరిరక్షణా విభాగం ఆధ్వర్యంలో శ్రీరంగాపూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ ఉపాధి హామీ కార్మికులకు బాల్య వివాహాలు, లైంగిక వేధింపుల నిర్మూలన కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.రాంబాబు హాజరై మాట్లాడుతూ వనపర్తి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చే లక్ష్యం దిశగా అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఎవరైనా అలా కాకుండా తక్కువ వయస్సు ఉన్న బాలికకు బాలురులకు పెళ్లి చేయాలని చూస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయబడునని తెలిపారు. పిల్లలకు మంచి స్పర్శ, చెడుస్పర్శ వాటిపైన తల్లిదండ్రులు అవగాహన కలిగించి ఎవరైనా సరే పిల్లలతో దురుద్దేశంగా ప్రవర్తించినట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వాలని పేర్కొన్నారు. అదే విధంగా అనాథ పిల్లలకు దుర్గాబాయి దేశముఖ్ కళాశాలలో పాలిటెక్ పాలిటెక్నిక్ ఎగ్జామ్ రాయకుండా నేరుగా ప్రవేశాలు కల్పించబడునని చెప్పారు. ఎవరైనా బాలలు ఆపదలో రక్షణ, సంరక్షణ అవసరం ఉంటే వెంటనే జిల్లా పరిరక్షణా విభాగం 1098 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సాయి ఈశ్వరి, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, ఉపాధి హామీ పథకం కార్మికులు పాల్గొన్నారు.


బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా పరిరక్షణ అధికారి

## జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించాలి: జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే 15,ప్రభాతవార్త:** జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటూ అధికారులు పూర్తి నిబద్ధతతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్ నందు రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులతో కలసి పాల్గొని రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. బీచుపల్లి నుంచి పుల్లూర్ జంక్షన్ వరకు ప్రమాద ప్రాంతాలను బ్లాక్ స్పాట్ గుర్తించి, వాటిపై సోమవారం నాటికి పోలీసు, జాతీయ రహదారుల అధికారులతో సంయుక్త పరిశీలన జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎర్రవల్లి నుండి గద్వాల వరకు ప్రమాద సూచిక బోర్డులు, హెచ్చరికల గుర్తులు, కల్వర్టుల మరమ్మతులు చేయాలని ఆర్ అండ్ బి శాఖను ఆదేశించారు. గద్వాల నుంచి రాయచూర్ మార్గంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండటంతో ప్రమాదాలకు అవకాశమున్నదని, వాటిని ప్రమాణాలతో అనుగుణంగా సవరించాలని, వాహనదారులకు భద్రతతో పాటు సౌలభ్యం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద రాత్రి వేళల్లో సరైన వెలుతురు, స్పష్టమైన సైన్‌బోర్డులు, బారికేడింగ్ ఉండేలా చూడాలని ఆదేశించారు. చెక్ పోస్ట్ ల వద్ద వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు సమతలంగా ఉండేలా, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మంచి వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. అవసరం మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను మరమ్మతులు చేపట్టాలని అన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు పోలీసు అధికారులే కాకుండా సంఘటన స్థలానికి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కూడా హాజరయ్యేలా చూడాలని, దీనివల్ల ప్రమాదానికి గల కారణాలు విశ్లేషించుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన నివారణ చర్యలు తీసుకొనుటకు వీలు కలుగుతుందన్నారు. తాత్కాలిక మరమ్మతుల కొరకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. హైవే పక్కన, జములమ్మ రోడ్డులో ఉన్న మద్యం దుకాణాలు, ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను ఎక్సైజ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రమాదాల ప్రాంతాలలో వెంటనే అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. పోలీస్, ఆర్ బీ, ఆర్ బి, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల వంటి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎస్పీ మొగలయ్య, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, పంచాయతీరాజ్ పి.ఆర్ దామోదర్ రావు, జిల్లా రవాణా అధికారి వెంకట్ రమణ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సిద్దప్ప, జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ హిమాన్షు గుప్త , ఎక్సైస్, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి డి.ఈ లు, ఎ.ఈలు, తదితరులు, పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

## జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**బాలానగర్, మే 15 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని తిరుమలగిరి మాజీ ఎంపీటీసీ నేనావత్ వెంకట్ రామ్ నాయక్ కూతురు వందన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పాల్గొన్నారు. ఏడుగుట్టల తండాలో అంబేద్కర్ విగ్రహవిష్కరణకు విచ్చేసిన ఎమ్మెల్యే కేక్ కట్ చేసి వందనకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో వందన ఉన్నత శిఖరాలు అధిరోహించి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు పాల్గొనాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

**చిన్నచింతకుంట, మే 15 ప్రభాతవార్త :** ఈనెల 20న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు పాల్గొనాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు జేఎన్ దేవదానం కోరారు. గురువారం కురుమూర్తి గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక చట్టాలన్నీ కూడా రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా తీసుకొచ్చిన నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను ఉపాధి కూలీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు కృష్ణయ్య, సాకలి బాలరాజ్, వెంకటన్న, హనుమంతు, మహిళా కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఇసుక వేలం పాట

**ఖిల్లాగణపురం. మే 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిడి మాడ గ్రామంలో వాటర్ ట్యాంకు దగ్గర నెల రోజుల క్రితం స్థానిక తహసిల్దార్ సుగుణ ఎస్సై సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో 42 ట్రాక్టర్ల అక్రమ ఇసుకనుసీజ్ చేశారు ఇట్టి విషయము కలెక్టర్కు నివేదించగా నేడు ఒక ట్రాక్టర్ఇసుకకు 1800 రూపాయల చొప్పున ప్రభుత్వంధర నిర్ణయించిందని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా ఎవరు వేలం పాట పాడితే వారికి ఉన్నది ఉన్నట్టుగా ఎత్తిస్తామని చెప్పారు వేలంపాటలో పాల్గొనవలసిన వారు ఉదయం 11 గంటలకు తాసిల్దార్ కార్యాలయంలో హాజరుకావాలని తహసిల్దార్ సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు.

## కార్పొరేట్ కళాశాలలకు

## దరఖాస్థులు చేసుకోండి

**గద్వాల, మే 15,ప్రభాతవార్త:** 2025 26 సంవత్సరానికి గాను గద్వాల జిల్లా యందు కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎస్సీ/ ఎస్టీ/ ఇ.బి.సి/ బి.సి మైనారిటీ /దివ్యాంగుల విద్యార్థిని /విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదవ తరగతిలో 7బిశితి లేదా 400 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు వెబ్సైట్ నందు ఈనెల 17 వ తేది నుండి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## కాంగ్రెస్ సీనియర్

## మహిళా నాయకురాలు మృతి

### నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

**చిన్న చింతకుంట, మే 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు కురువ మహాలక్ష్మి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేశారని కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు భాస్కర్ రెడ్డి మహిళా నాయకురాలు మహాలక్ష్మి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట అప్పపల్లి విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు ఎస్ వెంకటేష్, జాకీర్, జిజి పోలు, గంజి బాలరాజ్, ప్రతాప్, పెంటన్న, సంసోన్, అశోక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలి



వరి కొనుగోలు కేంద్రం వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో సురేష్

**తెలకపల్లి, మే15 ప్రభాతవార్త:** వరి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్ అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో వరి కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ జాకీర్ ఆలీతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులు పంట కోత అనంతరం తగిన తేమశాతం వచ్చిన తర్వాత (812) సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా టోకెన్ తీసుకుని, ధాన్యాన్ని ఇతర వ్యర్థాలు లేకుండా శుభ్రపరచి వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అనంతరం వరి కొనుగోలు రికార్డులను వారు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జాకీర్ హాలీ, కొనుగోలు నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## డబుల్ రోడ్డు మంజూరు కోసం ఉల్లిగుండం గ్రామస్తుల వినతి

**నారాయణపేట టౌన్, మే15 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం ఉల్లిగుండం గ్రామం మెయిన్ రోడ్ గెట్ ఎన్‌హెచ్ 163 నుండి దేవర పస్లావాదు వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఉల్లిగుండం గ్రామస్తులు కొడంగల్‌లో కాడ అధికారి వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విషయంపై స్పందించిన అధికారి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ రోడ్డు విషయంలో నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డిలు సైతం ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వినతి పత్రం అందించిన వారిలో శ్రీనివాస్ రెడ్డి, గడ్డం మహేష్ తో బాటు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

■ ఇద్దరికి తీవ్ర గాయాలు

**అయిజ.మే 15,ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం జింకలపాడు స్టేజి సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందగా ఇరువురికి గాయాలైన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే అయిజ మండలం గుడి దొడ్డి గ్రామానికి చెందిన హుస్సేన్ రెడ్డి తన భార్య కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పెబ్బేరు మండలం గంగారం గ్రామానికి వారి బంధువుల ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో ఎర్రవల్లి మండలం జింకలపల్లి స్టేజి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో తిమ్మమ్మ అలియాస్ బుజ్జమ్మ, 40 అక్కడికక్కడ మృతిచెందగా మృతురాలి కుమారుడు జగన్మోహన్ రెడ్డికి మరియు భర్త హుస్సేన్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది వెంటనే ఘటన స్థానానికి వెళ్లి తీవ్ర గాయాలైన తండ్రి కుమారులను గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తీసుకు వెళ్లినట్టు నేషనల్ హైవే ఈఎంటి వెంకటేష్ పైలట్ ప్రవీణ్ గౌడ్ తెలిపారు అనుకోని రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో ఒకరు మృతి చెందడం ఇద్దరూ తీవ్ర గాయాల అవడంతో గుడిదొడ్డి గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రాథమిక చికిత్స కేంద్రాలను సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారులు



చికిత్స కేంద్రానికి సీల్ వేస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు

**ఖిల్లాగణపురం, మే 15, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పలువురు ఆర్‌ఎంపి వైద్యులు అర్హతలకు మించి వైద్యం చేస్తున్నారని ఫిర్యాదు మేరకు గురువారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తొమ్మిది ప్రాథమిక చికిత్స కేంద్రాలను సీజ్ చేశారు. రోగులకు ప్రాథమిక చికిత్స కేంద్రాలలో ఆర్‌ఎంపిలు వారి స్థాయికి మించి ఇంజక్షన్ వేయడం గ్లూకోజులు ఎక్కించడం పలువురు ఆర్‌ఎంపీలు దెబ్బలు తగిలిన చోట కుట్లు వేయడం డెలివరీ కూడా చేస్తున్నట్టు తెలిసింది. దీంతో జిల్లా వైద్యాధికారులు మండల కేంద్రంలో ఉన్నటువంటి అన్ని ప్రాథమిక చికిత్స కేంద్రాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో జిల్లా బృందం సభ్యులు రవికుమార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని వినతి

**మక్తల్, మే 15 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని గుడిగండ్ల వద్ద 167వ జాతీయ రహదారికి ఇరు వైపులా అక్రమంగా వెలసిన ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం గ్రామస్తులు తహసీల్దార్ సతీష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలను ఏర్పాటు చేయడంతో రహదారి వెంబడి కాలుష్యం పెరిగి పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపినరేంద్ర, కృష్ణ ప్రసాద్ గౌడ్, నవీన్ కుమార్, హసీన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలానికి తరలిన మాణికేశ్వరి మాత ఆశ్రమ భక్తులు



శ్రీశైలం వెళ్తున్న మాణికేశ్వరి మాత ఆశ్రమ భక్తులు

**నారాయణపేట టౌన్, మే15 ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ వీరధర్మజ మాత ఆజ్ఞానుసారం శ్రీశైలం భ్రమరాంబిక మాత పరిసర గ్రామ దేవతల ముందు జరిగే జీవహింసను అడ్డుకునేందుకు గురువారం నారాయణపేట పట్టణం నుండి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ మాణికేశ్వరి మాతనారాయణపేట ఆశ్రమ భక్తులు శ్రీశైలానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామదేవతల ముందు జరిగే జీవహింసను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. జీవ హింస చేయడం నేరమన్నారు. తరలి వెళ్లిన వారిలో నారాయణపేట ఆశ్రమ భక్తులతో పాటు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి పోటాపోటీ

### అధ్యక్ష పదవికి 15 మంది దరఖాస్తు



అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, మే 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ దామరగిద్ద మండల అధ్యక్ష పదవి కోసం పోటాపోటీ కొనసాగుతుంది. గురువారం నారాయణపేట సివిఆర్ భవన్‌లో మండల అధ్యక్ష పదవికై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అబ్జర్వర్‌లు వేణు గౌడ్, సంధ్యారాణి డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పదవి కోసం 15 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో దామరగిద్ద గ్రామానికి చెందిన వారు బాల్‌రెడ్డి,పుట్టి ఈదప్ప బసుదేలక్ష్మణ్, ఎంశ్రీనివాస్, ఖాజామియా, బర్ల ఆనందు, శరన్ నాయక్, గొరిగేనూరు వెంకటప్ప, ఉండగా ఇతర గ్రామాల నుండి పిడెంపల్లి రఘు, సజనాపూర్ తిమ్మప్ప, ముస్తాపెట్ రాములు,కాన్‌కుర్తి మైనుద్దీన్,గడిమున్కన్ పల్లి మల్లికార్జున్‌లు దరఖాస్తు చేసుకున్నారు. కాగా మండల అధ్యక్ష పదవిని ముఖ్య నేత నిర్ణయిస్తారా లేక మండల నాయకుల నిర్ణయం మీరకే అధ్యక్షున్ని ఎంపిక చేస్తారా అన్న విషయాన్ని వేచి చూడక తప్పదు. ప్రతి నోటా యువ నాయకుడిని ఎన్నుకోవాలని మాట వినిపిస్తుంది. బరిలో నలుగురు నాయకులు ఉన్నట్టు సమాచారం.

# కల్లాలలో ఉన్న ప్రతి వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

■ అడిషనల్ కలెక్టర్ జి వెంకటేశ్వర్లు

■ రైతుల ఆందోళనతో స్పందించిన మంత్రి జూపల్లి



వీపనగండ్లలో రెండవ వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

**వీపనగండ్ల ,మే 15 ప్రభాతవార్త:** కళ్ళలో ఉన్న ప్రతి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు ఎలాంటి అధైర్య పడవద్దని వనపర్తి జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ జి వెంకటేశ్వర్లు రైతులకు విజ్ఞప్తి చేశారు ఆయన గురువారం నాడు వీపనగండ్ల మండల కేంద్రంలో రైతు కొనుగోలు రెండవ సెంటర్‌ను వీపనగండ్ల తహసీల్దార్ వరలక్ష్మి ప్రారంభించారు తూముకుంట సొసైటీ ఆధ్వర్యంలో ఈ సెంటర్ నువ్వు ప్రారంభించారు అయితే ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోరికల్లాలలో ధాన్యం పోసి ఉంచారు ప్రభుత్వం కొంటదో లేదో అని అధైర్య పడవలసినటువంటి అవసరం లేదని ఈ సందర్భంగా రైతులకు సూచించారు ప్రతి గింజను ప్రభుత్వం కొనడానికి వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు అయితే మంగళవారం నాడు వీపనగండ్ల మండల కేంద్రంలో ఐకెపి ద్వారా ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలు ధాన్యం సేకరణ నిలకడగా జరుగుతుందని వర్షాలు వస్తే తమ ధాన్యం తడిసిపోతుందని తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అందుకోసం వీపనగండ్ల మండల కేంద్రంలో మహిళా సంఘం ద్వారా ఒకే సెంటర్ ఏర్పాటు చేశారని రెండవ సెంటర్ కూడా ఏర్పాటు చేయాలని రైతులు వీపనగండ్ల తహసిల్దార్ వరలక్ష్మి కి ఆందోళన చేసి వినతిపత్రం ఇచ్చారు దానికి ఆమె జిల్లా కలెక్టర్ తో మాట్లాడి రెండవ వరి కొనుగోలు కేంద్రాన్ని తూముకుంట సొసైటీ ద్వారా ఏర్పాటుచేయడం కోసం ప్రయత్నం చేస్తానని రైతులకు హామీ ఇచ్చింది దానితోపాటు బుధవారం నాడు వివాహ సందర్భంగా గోపాలదిన్నెకు వచ్చిన ఎక్సైజ్ మరియు టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కార్యకర్తలు ఈ విషయం దృష్టికి తీసుకుపోగా ఆయన స్పందించి పై అధికారులతో మాట్లాడి రెండవ కేంద్రాన్ని తక్షణమే వీపనగండ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని చెప్పడంతో గురువారంనాడు అడిషనల్ కలెక్టర్ జి వెంకటేశ్వర్లు తూముకుంట సొసైటీ కార్యదర్శి రాముకు ఫోన్ చేసి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మండల కేంద్రంలో తూకం చేసినటువంటి వరి బస్తాలను తీసుకపోవడానికి లారీల కొరత బాగా ఉందని అంతేగాక మిల్లర్లు దించుకోవడం లేదు అని రైతులు ఆయన దృష్టికి తీసుకుపోగా దానితో ఆయన స్పందిస్తూ మండల కేంద్రంలో ఉన్న గిడ్డంగిని వరి బస్తాలు స్టాక్ చేయడం కోసం పరిశీలించగా అక్కడబాట సమస్య వివాదాస్పందంగా ఉండడంతో దానికి సంబంధించిన రైతు ఆటంకం చేయడం వల్ల వెంటనే ఇక్కడి బస్తాలను పెబ్బేరు గిడ్డంగులకు తరలించాలని ఆయన ఇక్కడ తూకం చేసే వారికి ఆదేశాలు ఇచ్చారు దానితో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ అధికారులకు ప్రజలు తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో కార్యదర్శి రాము కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్ కాంగ్రెస్‌పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పాము రాజశేఖర్ మునికొండ గోపి భరత్‌రెడ్డి సగనమని వెంకటస్వామి బత్తుల యాదయ్య యాదవ్‌అలియాస్ వైఎస్ పెబ్బేటి మహేష్ పాల్గొన్నారు.

## మునగాల రెవెన్యూ సదస్సులో 54 భూ సమస్యల కోసం దరఖాస్తులు



రైతుల నుండి భూ సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాసరావు

**ఇటిక్యాల, మే15 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూభారతి చట్టం తీసుకొచ్చిందని ఈ చట్టం ద్వారా రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా ఇటిక్యాల మండలం పైలట్ ప్రాజెక్టు ఎంపిక కావడంతో గురువారం 9వరోజు మండల పరిధిలోని మునగాల గ్రామంలో పాఠశాల ఆవరణలో తహసిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా ఈ సదస్సుకు ఆర్డిఓ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధరణిలో భూ సమస్యల వల్ల రైతుల ఇబ్బందులు పడ్డారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో భరణి స్థానంలో భూభారతి చట్టం అమలు చేస్తున్నారని పైలెట్ ప్రాజెక్టు కావడం వల్ల రెవెన్యూ సదస్సులు గ్రామాలలో ఏర్పాటుచేసి అధికారులు అందరూ గ్రామాలలోకి వచ్చి రైతుల నుండి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు తీసుకుంటున్నారని కొన్నింటికి ఉచితంగానే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని వీటికి మీ సేవలో చెల్లించే డబ్బులు రైతులకు అదా అవుతాయని రైతులకు వివరించారు. రైతులు ఇచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి విచారించి ఈ నెలాఖరు నాటికి భూ సమస్యలను జిల్లా స్థాయిలోనే పరిష్కరిస్తుందన్నారు. కిందిస్థాయి అధికారులు తప్పు చేస్తే కలెక్టర్ వరకు అప్పీల్ కూడా వేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా మునగాల గ్రామ పాఠశాల ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం 54 దరఖాస్తులు రైతుల నుండి స్వీకరించినట్లు తహసిల్దార్ వీరభద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారులు వీరభద్రప్ప, నరేష్, డిప్యూటీ తహసిల్దార్ నందిని, సీనియర్ అసిస్టెంట్లు మనోహర్, నరేష్, ఆర్ఐలు మదన్ మోహన్,గురురాజా సర్వేయర్లు దౌలమ్మ,అనసూయ, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

■ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

**గద్వాల, మే 15,ప్రభాతవార్త:** ఈనెల 20న జరిగే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండిని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బిఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం రోజున గద్వాల జిల్లా కేంద్రంలోఏఐటీయూసీ సీఐటీయూ,ఇఫ్ట్ కార్మిక సంఘాల నేతలతో కలసి ఈనెల 20న జరిగే దేశ వ్యాపిత సమ్మె పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈసంధ్బంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు, సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ,ఇఫ్ట్ కార్యదర్శి కార్తీక్‌లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంకార్మిక,కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల నుంచి 29 కార్మిక చట్టాలను విడదీసి నాలుగు లేబర్ కోడులుగా చేశారని అన్నారు.కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కోడ్ లు దేశం లోని విదేశీ కార్పొరేట్లకు అనులులంగా ఉన్నవని అన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలనీ అన్నారు.కనీసం వేతనం 26000/ చెల్లించాలని అన్నారు. స్కీమ్స్ వర్కర్స్ ను (అంగన్వాడీ, మధ్యాహన భోజనం కార్మికులు, ఆశ )ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు.. ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటికర్ణ ఆపాలని అన్నారు. కేంద్రంలోని మోడీప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని అన్నారు. కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు కట్టు బానిసలుగా తయారు చేయాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని అన్నారు..ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రైవేటీకరణను వెంటనే ఆపివేయాలని,కాంట్రాక్టు ఔట్సోర్సింగ్,థర్డ్ పార్టీ కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి,జీవో నెంబర్60 ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు,కారోబార్లను పంచాయతీ కార్యదర్శిగా నియమించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి,సమాన వేతనం చెల్లించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యరాజు,సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ, ఇఫ్టు దానయ్య, ఏఐటీయూసీఆటో యూనియన్ అధ్యక్షులు తాటికుంట వెంకటేష్,ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఆటో కార్మికులు శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు

■ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు అందడం లేదు

■ జిల్లా బిజెపి అధ్యక్షులు రామాంజనేయులు



బిజెపి కార్యకర్తలతో జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు

**ఇటిక్యాల, మే15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలు కార్యకర్తలకే ఇండ్లు మంజూరు చేస్తున్నారని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు అందడం లేదని జోగులాంబ గద్వాల జిల్లాబిజెపి పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. గురువారం ఎర్రవల్లి మండలం కోదండాపూర్ గ్రామంలో నియోజకవర్గంలోని ఎర్రవల్లి, ఇటిక్యాల, మానవపాడు మండలాల బీజేపీ మండల కమిటీ నాయకులతో జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా ఇంచార్జీ విద్యాసాగర్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో వివిధ మండలాలలో కాంగ్రెస్ ప్రభున్త్వ ఇందిరమ్మ ఇండ్లు మంజూరులో అవకతవకలు జరిగాయని కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు ఇస్తున్నారని వాస్తవంగా ఇల్లు లేని నిరుపేదలకు అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.వీటిపై జిల్లా యంత్రాంగం స్పందించి వెంటనే లబ్ధిదారులకు అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు కేకేరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి,మండల ప్రభారీ నరసింహులు, మల్లేష్, మహేంద్ర, రాజు, శివ, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శిని పరామర్శించిన బిఆర్ఎస్, సీపీఐ నాయకులు



సురవరం సుధాకర్‌రెడ్డిని పరామర్శించిన బిఆర్ఎస్, సీపీఐ నాయకులు

**గద్వాల, మే15,ప్రభాతవార్త:** సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ని టిఆర్ఎస్, సిపిఐ నాయకులు వెంకట్ రాములు, ఆంజినేయులు పరామర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, కంచుపాడు గ్రామంలో జన్మించిన సురవరం కుటుంబంనడిగడ్డకు ఒక వరంలాంటిదన్నారు. ముందుగా ఆకుటుంబంలో ప్రముఖ సాహిత్యకారుడు తెలంగాణ ఉద్యమ జ్యోతి,బహుముఖ ప్రజ్ఞాశాలి గోల్కొండ పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు నైజామును ఎదిరించి పోరాడిన ధీశాలి తెలంగాణ విముక్తి కోసం అక్షరమే ఆయుధంగా పోరాడిన అత్యంత ప్రతిభాశాలి ఆయన కుటుంబం నుంచి వచ్చిన మరో ఆణిముత్యం సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. ఎఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడిగా,ఢిల్లీ కళాశాల నాయకునిగా జాతీయ అధ్యక్షుడు గా, ప్రధాన కార్యదర్శిగా, ఎదిగి పెదలకోసం కేసులు,జైల్లని ముద్దాడి ఆతర్వాత సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఉండి రెండుసార్లు ఎంపీగా దేశానికి సేవలు అందించిన అతిరథ మహారతుడు సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ఈ మధ్య కాలంలో అస్వస్థతకు గురయినాడు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సుధాకర్‌రెడ్డి సొంత గ్రామం కంచుపాడులో గురువారం పరామర్శించారు. సిపిఐ జాతీయ నాయకులు పార్లమెంటరీ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు జరగడానికి కారణమైన వ్యక్తులలో ఆయన ఒకరు అన్నారు. నిరుపేదల పట్ల జాలి,దయ కలిగి వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేసి వారి ఆకలి తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉపాధి హామీ పథకం ఇతర అనేక కార్మిక చట్టాల రూపకల్పనలో గణనీయమైన పాత్ర నిర్వహించాడన్నారు. దళితుల కోసం కొంత భూమిని త్యాగం చేసిన ఘనుడు,అటువంటి యోధున్ని నేడు పరామర్శించడంతో గొప్ప అనుభూతుని పొందామని నగర్ దొడ్డి వెంకట్రములు, బి ఆంజనేయులుతెలిపారు.ఆయన సతీమణి ఆయనకు ఉద్యమాలలోనే కాదు పార్టీ కార్యక్రమాల్లో చేతోడు, వాదోడుగా ఉంటూ నేటికీ ఆయనను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఆయన కొడుకు, కోడలు కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడుని కోరు తున్నామన్నారు. నడిగడ్డలో ఇటువంటి ఉద్యమ నాయకుడి కలవడం సంతోషమనీ వారు వ్యక్తం చేశారు. వారి వెంట ఎర్రవల్లి రఘునాథరెడ్డి తదితర మిత్రులు ఉన్నారు.

## పిల్లల కోసం ప్రత్యేక యోగ విజ్ఞాన శిబిరం

**నారాయణపేట టౌన్, మే 15 ప్రభాతవార్త:** పతంజలి యోగ సమితి నారాయణపేట వారి ఆధ్వర్యంలో పిల్లల కోసం ప్రత్యేక యోగ విజ్ఞాన శిబిరాన్ని నారాయణపేట పట్టణంలో 2వ బ్యాచ్ నేటి నుండి ప్రారంభం కానున్నట్లు పతాంజలి యోగ సమితి నారాయణపేట వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామమాత్ర రిజిస్ట్రేషన్ ఫీజు300/ తో నిర్వహించబడును అన్నారు.ఈ శిక్షణలో ఆసన, ప్రాణాయామ, మెమరీ గేమ్స్,ఆటలు, పాటలు, కథలు, శ్లోకాలు మొదలైన అంశాల ద్వారా పిల్లలలో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తూ నిర్వహించబడుతుంది అన్నారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94911 67371 సంప్రదించలన్నారు.

## బడుగు బలహీనవర్గాల ఆరాధ్య దైవం డా.బి.ఆర్ అంబేద్కర్

◆ జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**బాలానగర్, మే 15 ప్రభాతవార్త:** బాలానగర్ మండలం ఏడు గుట్టల తాండ గ్రామ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ నిలువెత్తు అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామ మాజీ సర్పంచ్ చందు నాయక్ తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత దేశానికి సమర్థవంతమైన పరిపాలన కోసం పటిష్టమైన రాజ్యాంగాన్ని తయారు చేసిన మహా మేధావి, ప్రపంచ జ్ఞాని అంబేద్కర్ అని ఆయన పేర్కొన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరుపురానివని, అంబేద్కర్ ముందు చూపుతోనే నేడు తండాలు పంచాయతీలుగా ఏర్పాటు చేయడం, గ్రామ స్వరాజ్యం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బడుగు బలహీనవర్గాలఆరాధ్య దైవం అంబేద్కర్ అని కొనియాడారు. అనంతరం బిఎంపి జాతీయ అధ్యక్షులు దాస్ రామ్‌నాయక్ అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆయన విద్యా విధానం, దేశం కోసం ఆయన చేసిన సేవల గురించి సుధీర్ఘంగా ప్రసంగించి ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్‌నాయక్, ఓబీసీ జిల్లా చైర్మన్ తిరుపతి, ఎంఈఓ శంకర్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, హరి సింగ్, రాజేశ్వర్ రెడ్డి, తిరుమలగిరి మాజీ ఎంపీటీసీ వెంకట్రాంనాయక్, మొదంపల్లి మాజీ సర్పంచ్ చందు నాయక్, ఏడుగుట్టల తండా మాజీ సర్పంచ్ హనుమ నాయక్, గ్రామ అధ్యక్షులు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**మానవపాడు, మే 15 ప్రభాతవార్త :** అయిజ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు అంజిబాబు బుధవారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆయన్ని కర్నూల్ లోని ఆసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహం హాస్పిటల్ కు వెళ్ళి బాధితున్ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అక్కడ ఉన్నటువంటి స్థానిక నాయకులను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులకు సూచించారు.

## కుటుంబ కలహాలతో వివాహిత అదృశ్యం

**నవాబుపేట,మే 15 ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని హనుమసానిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం హనుమస్‌పల్లి గ్రామానికి చెందిన నలిగంటి పద్మమ్మ పాపన్న కూతురుమండల పరిధిలోని కిష్టంపల్లి గ్రామానికి చెందిన మురుగని మాధవులకు 10 సంవత్సరాల క్రితం ఇచ్చి పెళ్లి చేయగా కొన్ని రోజులుగా కుటుంబ కలహాలతో హనుమస్‌పల్లి తల్లిగారి ఇంటికి వచ్చిన స్వాతి 13న మంగళవారం తెల్లవారు జామున నుండి కనబడకుండా పోయింది. కుటుంబ సభ్యులు బంధువులను విచారించగాఆచూకీతెలియక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకునే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులు

**గద్వాల, మే 15,ప్రభాతవార్త:** 202526 విద్యా సంవత్సరంనకుగాను తెలంగాణ గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల యందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకై గిరిజన విద్యార్థుల(బాలురు) నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి కె.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసిన గిరిజన విద్యార్థులు (బాలురు) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపిసి, మరియు సీఈసీ గ్రూపులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల ఎంపిక పదవ తరగతిలో వారు పొందిన మార్కుల ఆధారంగా జరగనుందని ఆయన తెలిపారు. ఎంపీసీ14, బైపిసి 48, సిఇసి 33,మొత్తం 95 సీట్లు ఖాళీలు కలవని ఆయన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు టి జిఈఎంఆర్ఎస్ బాలానగర్ మరియు జిఈఎంఆర్ఎస్ కల్వకుర్తి ప్రిన్సిపల్స్ నుండి దరఖాస్తు ఫారం పొందవచ్చు అని, పూర్తిచేసిన దరఖాస్తు తో పాటు అన్ని అర్హత ధ్రువీకరణ పత్రాలను జత చేసి ఈనెల 24వ తేదీ సాయంత్రం 4:00గంటల లోపు సంబంధిత ప్రిన్సిపల్స్ కు సమర్పించాలన్నారు.కౌన్సిలింగ్ ప్రక్రియ ఈనెల 26వ తేదీన ఉదయం 10:00 గంటలకు జిఈఎంఆర్ఎస్ బాలనగర్, మహబూబ్ నగర్ జిల్లా యందు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు చేరిన తర్వాత మిగిలిన సీట్లను అదే తేదీన స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం మహబూబ్ నగర్ నందు బాలనగర్ మరియు కల్వకుర్తి నందు మాత్రమే తెలంగాణ గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్వహించబడుచున్నవి. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనము, నోటు పుస్తకాలు, బెడ్స్ , దుస్తులు ఉచితంగా అందిస్తున్నట్లు ఈ ప్రకటన ద్వారా ఆయన తెలియజేశారు. ఇతర వివరములకు 9415606618, 9855737578, 9885738387, 8520041973 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

# విదేశీ మహిళల కాళ్లు కడిగించడం

- మన ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే
- రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితిరెడ్డి

**మహబూబ్‌నగర్, మే 15 ప్రభాతవార్త:** ప్రపంచ అందగత్తెల పోటీ పేరుతో తెలంగాణ మహిళలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం కాంగ్రెస్ ప్రభుత్వ బానిసత్వానికి, మహిళలపై ద్వేష భావానికి నిదర్శనమని, తెలంగాణ ఆడబిడ్డలతో విదేశీ అందెగత్తెల కాళ్లను కడగడం తీవ్ర అవమానకరమని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితి రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. ఇది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవం మీద దాడి అని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మాభిమానాన్ని అందాల పోటీకి వచ్చిన సుందరీమణుల పాదాల దగ్గర పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడాన్ని బిజెపి మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తోందని తేల్చి చెప్పారు. అందాల పోటీల్లో భాగంగా రామప్ప దేవాలయ సందర్శనకు వచ్చిన సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడపడుచుల చేత కడిగించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, దళిత, గిరిజన మహిళల పట్ల రాష్ట్ర ప్రభుత్వ తీరు మరింత అవమానకరంగా వ్యవహరించిందన్నారు. ఈ చర్యకు రాష్ట్ర ప్రభుత్వం ఈ దారుణ ఘటనకు తక్షణ క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమ నిర్వాహకులపై, సంబంధిత అధికారులపై చర్యలుతీసుకోవాలని కోరారు. తెలంగాణ గర్వించే సమ్మక్క, సారలక్క పుట్టిన ప్రాంతంలో ఇలాంటి అవమానం జరగడం బాధాకరమన్నారు. విదేశీ సుందరీమణుల గౌరవం కూడా చాలా ముఖ్యమే. కానిమన సొంత ఆడపడుచులగౌరవం తగ్గకుండా చూసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు.

# రెండు చూచిరాత కేసులు నమోదు

### పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కే ప్రవీణ వెల్లడి

**మహబూబ్‌నగర్, మే15, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉదయం జరిగిన డిగ్రీ 6 సెమిస్టర్ ఎగ్జామ్ లో 9333 మంది గాను 8946 మంది విద్యార్థులు హాజరయ్యారని, 385 మంది గైర్హాజరైనట్లు పియు పరీక్షల నియంత్రణ అధికారి ప్రవీణ తెలిపారు. రెండు చూచిరాత కేసులు నమోదయాయని, మధ్యాహ్నం జరిగిన 2 సెమిస్టర్ ఎగ్జామ్‌లో 9842 మందికి గాను 9250 మంది హాజరయ్యారని, 592 మంది విద్యార్థులు గైర్హాజరయ్యాలని పరీక్షల నియంత్రణ అధికారి ఒక ప్రకటన తెలిపారు.

# సుశిక్షితులైన వైద్యులుగా తయారు కావాలి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎస్ రామకృష్ణారావు

మొదటి పేజీ తరువాయి భాగం..

సూచించారు. ప్రభుత్వం హెల్త్ కేర్ పై ప్రత్యేక దృష్టి పెట్టిందని, నారాయణపేట మెడికల్ కళాశాల రాష్ట్రంలోని మిగతా కళాశాలలకు ఒక మోడల్ గా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్ మెడికల్ కళాశాల డెమోగ్రఫీని ప్రజెంట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, టిజీఎంఎస్ఐడిసిసీ, ఇ.దేవేందర్, ఈఈరవీందర్, డీఈకృష్ణమూర్తి, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

**పెట్రోల్ పంపును పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు...**

మెడికల్ కళాశాల సందర్శన అనంతరం సింగారం మలుపు దారివద్ద జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్‌ను పరిశీలించారు. పంప్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందితో మాట్లాడారు. ఎక్కడ శిక్షణ తీసుకున్నారని, పంపులో రోజుకు ఎన్ని గంటలు పని చేస్తారని అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ పంప్‌లో ఫైర్ సేఫ్టీ ఉందా అని అడిగారు. పంప్ నిర్వహణకు అవసరమైన నిబంధనలు అన్ని పాటించాలని సూచించారు. రోజుకు ఎన్ని లీటర్ల పెట్రోల్ డీజిల్ విక్రయం జరుగుతుందని ప్రశ్నించారు. పెట్రోల్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారని, ఎన్ని రోజులకు పెట్రోల్ వాహనం వస్తుందని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చంద్ర కళను అడగగా రోజుకు 5 వేల లీటర్ల విక్రయం జరుగుతుందని, హైదరాబాద్ నుంచి మూడు రోజులకు ఒకసారి పెట్రోల్ వాహనం వస్తుందని ఆమె సీఎస్ కు తెలిపారు. పంపు ద్వారా నెలకు ఎంత ఆదాయం వస్తుందో డిఆర్డిఓ మొగులప్ప సీఎస్ కు వివరించారు.

# సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

### పాలమూరు నుంచి ప్రారంభించనున్న ఆర్టీసీ అధికారులు

**మహబూబ్‌నగర్ మే 15, ప్రభాతవార్త:** పాలమూరు పట్టణ ప్రజలకు, పరిసర ప్రాంత ప్రజలకు ఆర్టీసీ శాఖ శుభవార్త తెలిపింది. సరస్వతీ నది పుష్కరాలకు వెళ్లాలనుకునే యాత్రికులకు మే 15 నుంచి మే 26 వరకు జరిగే సరస్వతి నది పుష్కరాలకు మహబూబ్ నగర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ఈ బస్సు మే 17వ రాత్రి 09.00 గంటలకు మహబూబ్ నగర్ నుండి బయలుదేరి మే 18న ఉదయం 05.00 గంటలకు పుష్కర ఘాటుకు చేరును, పుష్కర స్నానానంతరం తిరిగి మధ్యాహ్నం 2.00 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు మహబూబ్ నగర్ కు చేరుకొనునట్లు అధికారులు వెల్లడించారు. బస్సు చార్జీ ఒక్కొక్కరికి రూ. 1800/ ( రాను పోను చార్జీలు, టోల్ టాక్స్ లు, మరియు ఇతర సెస్సులు కలుపుకొని) టూరు ప్యాకేజీగా నిర్ణయించారు. అంతేకాకుండా కనీసం 20 ప్రయాణికులు గ్రూపుగా ఉన్న బస్సును తమ తమ కాలనీలకు పంపించిపికప్ చేసుకునే సదుపాయం కూడా ఉందన్నారు. సదుపాయాన్ని సమీప టి.జి.ఎస్.ఆర్.టి.సి, రిజర్వేషన్ కౌంటర్ నందు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి సమాచారం గురించి 9959226286, 7382827138, 9441 162 588 నెంబర్లను సంప్రదించాలని మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సూచించారు.

# వీర జవాన్లకు పురిటిగడ్డ



- ఏకంగా 42 మంది జవాన్లకు జన్మనిచ్చిన గ్రామం
- దేశరక్షణకు తన వంతు సహకారమందిస్తున్న గొరిట
- ఉమ్మడి పాలమూరు జిల్లాలకే కాదు దేశానికే ఆదర్శంగా నిలిచిన పల్లెటూరు
- జవాన్లను పుట్టిల్లుగా ప్రతి ఒక్కరి నోట నానుతున్న నాగర్‌కర్నూల్ జిల్లాలోని గొరిట గ్రామం

**భూత్పూర్, మే 15, ప్రభాతవార్త :** దేశ రక్షణ కోసం ఆహర్నిశలు శ్రమిస్తూ తమ ప్రాణాల్ని సైతం ఫణ్ణంగా పెడుతూ దేశప్రజల సంరక్షణలో తమ జీవిత కాలాన్ని దేశానికి అంకితం చేసే వీర జవాన్ల గూర్చి మనమెంత చెప్పినా తక్కువే. దేశ సరిహద్దులో నిద్రాహారాలను త్యజించి దేశప్రజల ప్రాణాల్ని శత్రు సైన్యం నుంచి కాపాడడమే లక్ష్యంగా పెట్టుకుని కాలాన్ని భిక్కుభిక్కుమంటూ క్షణమొక యుగంలా భావిస్తూ దేశ రక్షణే ప్రధాన కర్తవ్యంగా భావించే సైనికులు 42మంది మిలటరీలో సైనికులుగా వివిధ హోదాలలో పనిచేసే వారు ఒకే గ్రామంలో ఉండడం ఆ గ్రామం, జిల్లాకే కాదు దేశానికే ఆదర్శం. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని తిమ్మాజిపేట మండలం గొరిట గ్రామం దేశ రక్షణ కోసం పాటుపడే జవాన్లకు పుట్టిల్లుగా దేశ చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచింది. గ్రామానికి చెందిన దాదాపుగా 42మంది జవాన్లు వివిధ హోదాలలో దేశ సరిహద్దులో పనిచేస్తున్నారు. ఏడాదిలో కేంద్ర రక్షణశాఖ కల్పిస్తున్న నెలనెలన్నర రోజులు సెలవుల్లో తమ కుటుంబ సభ్యులతో గడిపేందుకు తమ సొంతూరు గొరిటకు వచ్చిన వీరు ఇటీవల వారం, పది రోజులుగా దాయాదుల దేశమైన పాకిస్థాన్‌తో ముప్పువాటిల్లినందున కేంద్రం దేశంలోని సైనికులకు సెలవుల్ని రద్దు చేస్తూ తక్షణం తాము పనిచేసే తమ తమ రెజిమెంట్లలో రిపోర్టు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో గొరిట గ్రామానికి చెందిన 42మంది సైనికులు తమ పెట్టెలు, తమ తమ మూనిఫాంలను సర్దుకుని లగేజీ బ్యాగులతో దేశ రక్షణ కోసం పోరాడేందుకు ప్రయాణానికి సిద్ధం కావడం వారి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ పెద్దల కంట ఒ వైపు తడిపెట్టించడమే కాకుండా దేశ రక్షణ కోసం పోరాడే వీర సైనికులు తమ గ్రామ బిడ్డలేనని గర్వంగా చెప్పుకుంటున్నారు. గత నెల 22నదాయాది దేశం పాకిస్థాన్ ఉగ్రవాదులు భారత స్విట్జర్లాండ్‌గా



అప్పల అరవింద్
సైనికుడు, గొరిట గ్రామం

పేర్కొనే కాశ్మీరంలోని పహల్గాంలో ప్రకృతి ఆనందాన్ని ఆస్వాదిస్తున్న భారత పర్యాటకులపై నిర్ధాక్షిణంగా కాల్పులు జరిపి మన దేశానికి చెందిన 27మందిని పొట్టనపెట్టుకున్నారు పాకిస్థానీ ఉగ్రవాదులు. విషయం తెలుసు కున్న ప్రధాని నరేంద్రమోదీ చలించిపోయి ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్ ఉగ్రవా దుల్ని ఏరిపారేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాశ్మీర్‌లోని పీఓకె9 స్థావరాలు, ప్రాంతాలపై ప్రతిదాడులు నిర్వహించి పాక్ ఆటల్ని కట్టడి చేశారు. యుద్ధంలో దాదాపు11మంది ఉగ్రవాదులను మట్టు బెట్టి దేశరక్షణలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన మురళి నాయక్ అనే వీరజవాన్, భారత యువతేజం చివరకు తన ప్రాణాల్ని కోల్పోయాడు. ఇక దేశరక్షణకోసం తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట మండలం గొరిట గ్రామం దాదాపుగా 42 జవాన్లను జన్మనిచ్చి దేశరక్షణకు పంపించి భారతదేశ చరిత్ర పుటలో గొరిట గ్రామం చిరస్థాయిలో నిలిచేదిగా ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. దేశ రక్షణ కోసం గొరిట గ్రామం నుంచి సైనికులుగా చేరినయువకులు చాకలి హన్మంతు, ఎస్ లక్ష్మారెడ్డి, ఎన్ గంగాధర్, కెశాంతయ్య, ఎం నోబుల్‌రెడ్డి, ఎస్ రాజ్ గోపాల్, పి చెన్నయ్య, ఎ శంకరయ్య, పి చెన్నారెడ్డి, కె చక్రవర్తి, కె శ్రీహరి, కె రాజశేఖర్‌రెడ్డి, కె. శ్రీశైలం, ఎన్ రవి, ఎన్ రాఘవేందర్ రెడ్డి, కె సంతోష్‌రెడ్డి, ఎన్ రాఘవేందర్, ఎస్ వినోద్, ఎండి నదీమ్, కావలిచిన్నకిష్టయ్య, కావలిరామకృష్ణ, ఎండి సమి, నాగరాజు, బి తేజయాదవ్, ఎ శ్రీధర్, సి మహేష్, టి బాల్‌రాజు, ఎం మణికాంత్, ఎఅరవింద్, ఎంకల్యాణ్, మల్లేష్ యాదవ్, అంజనేయులు యాదవ్, జగదీష్, ఎం సత్యనారాయణ, రాజేందర్‌రెడ్డి, బి తేజ, బాల్‌రాం, కమ్మరి జేజయ్య, కమ్మరి కాసుపత్రి, యాదయ్య, ఎండిహనీఫ్ తదితరులు గొరిట గ్రామం నుంచి సైన్యంలో చేరారు. వీరిలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు, ముగ్గురు చొప్పున దేశరక్షణ లో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. గడిచినమూడు దశాబ్దాల కాలంనుంచి గ్రామంనుంచి సైనికులుగా భారత సైన్యంలో చేరారు. కొందరు పూర్తి సర్వీసు చేసి పదవీ విరమణ పొంది ప్రభుత్వం ఇచ్చేపెన్షన్ తో కాలాన్ని నెమరు వేసుకుంటూ కాలాన్ని వెల్లదీస్తున్నారు. మరికొందరు నాలుగైదేళ్ల క్రితం సైన్యంలో చేరి దేశకోసం పోరాడుతున్నారు. మరికొందరు మరోపదేళ్ల పాటు పదవీలో కొనసాగుతూ దేశరక్షణలో తమ వంతు పాత్రను పోషిస్తు న్నారు. ఒకే గ్రామం నుంచి ఏకంగా 42మంది వీరసైనికులు సైన్యంలో పనిచేయడం గ్రామానికే కాదు జిల్లా, రాష్ట్రం, దేశానికి గర్వకారణమనిపలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సైన్యంలో చేరేందుకు వెనకంజవేసే నేటి యువకులు గొరిట గ్రామ యువకులు, వీరసైనికుల్ని ఆదర్శంగా తీసుకుని మిలటరీలో చేరిదేశరక్షణ కోసం తమ వంతు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. దేశరక్షణ కోసం మిలటరీకి ఏకంగా 42మంది యువకుల్ని పంపిన గొరిట గ్రామాన్ని మనలో ప్రతి ఒక్కరూ అభినందించి గొరిట గ్రామానికి కృతజ్ఞత చెప్పాల్సిన అవసరమెంతైనా ఉంది.

**మా గ్రామం చాలా పుణ్యం చేసుకుంది**

**- మురళిధర్‌రెడ్డి, గొరిట మాజీ సర్పంచి**



దేశ సేవలో తమ గ్రామం నుంచి ఏకంగా 42మంది జవాన్లు సైన్యం చేరడం మా గ్రామ అదృష్టంగా భావిస్తున్నాను. మా గ్రామం చాలా పుణ్యం చేసుకుందని గొరిట గ్రామ మాజీ సర్పంచి మురళిధర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు . మారుమూల ప్రాంతమైన తమ గొరిట గ్రామాన్ని పది మంది గుర్తించడం ముదావాహమని పేర్కొన్నారు. ప్రస్తుత పాకిస్థాన్ యుద్ధంలో తమ గ్రామ సైనికులు తమ వంతు పాత్ర పోషించడం గర్వకారణంగా భావిస్తున్నామని గ్రామ మాజీ సర్పంచి మురళి ధర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీ రిజర్వేషన్ కోసం నిరాహార దీక్ష

### 42 శాతం రిజర్వేషన్ సాధన సమితి జేసీ రాష్ట్ర కన్వీనర్ డా. దాసరి అజయ్ కుమార్

**కొల్లాపూర్, మే 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్ సాధన కోసం ఈనెల 18వ తేదీన కొల్లాపూర్ పట్టణంలో ఒకరోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నట్లు 42 శాతం రిజర్వేషన్ రాష్ట్ర సాధన సమితి జేఏసీ కన్వీనర్ డా. దాసరి అజయ్ కుమార్ తెలిపారు. గురువారం కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18ఆదివారం రోజు కొల్లాపూర్ పట్టణంలో సురభి రాజా బంగ్లా ముందు ఉదయం 8 గం.ల నుంచి సాయంత్రం 5 గం.ల వరకు ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ కులాలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని, 42శాతం బీసీ రిజర్వేషన్ సాధన జేఏసీ రాష్ట్ర నాయకులు డా. దాసరి అజయ్ కుమార్ యాదవ్, ప్రొఫెసర్ శివార్చక విజయ కుమార్ పిలుపు నిచ్చారు. బీసీల ఐక్యత వర్ధిల్లాలని, మహాత్మ జ్యోతిబాపూలే, డా. బాబాసాహెబ్ అంబేద్కర్, బీపీ మండల్ లాంటి మహనీయులు కలలు కన్న ఆశయాల సాధన కోసం గ్రామ స్థాయి నుంచి బీసీ రిజర్వేషన్ సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని వారు పేర్కొన్నారు. దేశ జనాభాలో 56పైగా బీసీల జనాభా ఉందని, వేల సంవత్సరాలుగా సేవారంగంలో, ఉత్పాదక రంగంలో పనిచేస్తూ సమాజ నిర్మాణంలో ప్రధాన భూమికను పోషిస్తున్న బీసీ కులాలు శ్రమ, మేధస్సు, నిపుణతతో మనుగడ, అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నాయని వారు పేర్కొన్నారు. కాయ కష్టాన్ని నమ్ముకుని, నిజాయితీగా బతుకుతూ, అన్నదమ్ముల్లా మెలుగుతూ భారతజాతికి గౌరవం, కీర్తి, ప్రతిష్ఠలను సంపాదించిన పుడమి తల్లి పుత్రులమని, బీసీలు కొవ్వొత్తిలాంటి వారని, తాము కాలుతూ ఇతరులకు వెలుగు నిచ్చేవారమని వారు స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను



మాట్లాడుతున్న సాధన సమితి జేసీ రాష్ట్ర నాయకులు

రెండో తరగతి పౌరుల్లా చూస్తూ, వాడుకొని పారేస్తున్నారని, రాజ్యాంగ పరంగ, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రావాల్సిన వాటాను ఇవ్వడానికి ప్రభుత్వాలు సంతోషంగా సహకరించడంలేదని వారువిచారం వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు, పెద్దలు తమ స్వార్థ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తుందని వారు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో జనబలం కీలకమని, బీసీలందరు సంఘటితమై ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అందు కోసం సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. బీసీలకు 42 విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని, శాసనసభ తీర్మానం చేసి, గవర్నర్ ఆమోదంతో కేంద్రానికి పంపించిందని, ఆ బిల్లు పాస్ అయ్యే వరకు మడమ తిప్పని పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని వారు స్పష్టం చేశారు. ఇది చట్టబద్ధంగా అమలుకావాలంటే, కేంద్ర ప్రభుత్వంఈ నిర్ణయాన్ని చట్టంగా చేసి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని, ఈ లక్ష్య సాధన కోసం బీసీలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు. అందరూ నిరాహార దీక్షలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా వారు కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు శివశంకర్ యాదవ్, బీసీ జనచైతన్యవేదికజిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

# భావితరాలకు మీరు దిక్సూచి

మొదటి పేజీ తరువాయి భాగం..

యూనివర్సిటీ లో ప్రారంభం కానున్న నూతన ఇంజనీరింగ్ కాలేజీలో మన మహబూబ్‌నగర్ బిడ్డలు చదువాలన్నది తన ఆశయం అని ఆయన చెప్పారు. అంతకుముందు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ విద్య ఒక్కటే శాశ్వతమైనది అని తెలిసిన వ్యక్తి మన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే. అందుకే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న నిరుపేద పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలనే సంకల్పం తోటి ఉచితంగా ఎప్‌సెట్‌లో కోచింగ్ ఇప్పించారని ఎమ్మెల్యే అందించిన ప్రోత్సాహంతో విద్యార్థులు నేడు మంచి ర్యాంకులు సాధించారని, ఇది మన మహబూబ్‌నగర్ విద్యా వ్యవస్థకు ఎంతో శుభపరిణామం అని అన్నారు. ఎమ్మెల్యే కృషితో మనకు ఐఐఐటి కళాశాల కూడా రాబోతుందని కలెక్టర్ చెప్పారు. ఇలాంటి ఎమ్మెల్యే మనకు ఉండడం మన అదృష్టం అని ఆమె అన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా హాజరైన పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని, ఈ ఫలితాలు ఎమ్మెల్యేకు మరింత బలాన్ని ఇస్తాయని అన్నారు. విద్యార్థులు సాధించిన ర్యాంకులతో రాష్ట్రంలోని టాప్ టెన్ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వస్తుందని, మంచి కోర్సులు ఎంచుకొని మీరు జీవితంలో స్థిరపడాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, టి పిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కౌసర్ జహాన్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతా చారి, జేపీఎస్సీ ఈ రవికుమార్, రిషి జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటయ్య, ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూడంచెల బందోబస్తు..

- నేడు సాయంత్రం ప్రపంచ సుందరీమణుల పర్యటన
- భద్రతా విధుల్లో 980 పోలీసులు
- పిల్లలమర్రి వద్ద ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ జానకీ ధరావత్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 15, ప్రభాతవార్త:** 72వ మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో ఈ నెల 10వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో, నేడు (16న) శుక్రవారం సాయంత్రం 5:00 గంటల నుండి 7:00 గంటల వరకు వివిధ దేశాలకు చెందిన 22మంది మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పిల్లలమర్రి మహావృక్షాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్శన సందర్భంగా వారు మొదటగా పిల్లలమర్రి ప్రాంగణంలోని శ్రీరాజా రాజేశ్వరి ఆలయాన్ని, అనంతరం జిల్లా మ్యూజియం, చివరగా పిల్లలమర్రి మహావృక్షాన్ని దర్శించనున్నారు. కంటెస్టెంట్లు సందర్శించే ప్రదేశాలను ముందుగానే జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించి, భద్రతా పరంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం బృందావన్ గార్డెన్‌లో బందోబస్త్ నిమిత్తం వచ్చిన 980 పోలీసు సిబ్బందికి బ్రీఫింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్పీమాట్లాడుతూ, బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది అందరూ అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సామరస్యంతో బందోబస్తు నిర్వహించాలన్నారు. అలాగే, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, రాకపోకలకి ఆటంకం లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమం జిల్లాలో జరగడంగర్వకారణం. సుందరీమణుల భద్రతకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తూ, శాంతియుతంగా, ఆహ్లాదకరంగా కార్యక్రమం జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రజలు సహకరించాలి," అని తెలిపారు. ఈ సందర్శన ద్వారా పిల్లలమర్రి ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభించనుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపుఎస్పీసురేష్ కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, సుదర్శన్, శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ రూరల్ ఇన్స్పెక్టర్ గాంధీ, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ అజాజుద్దీన్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ వెంకటేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిల్లలమర్రిని పరిశీలిస్తున్న ఎస్పీ, జిల్లా అధికారులు

# సుందరీమణుల పర్యటనకు సర్వం సిద్ధం

### - అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశాం : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, మే15, ప్రభాతవార్త:** మే 10 నుండి 31 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీల నేపథ్యంలో మే16న ప్రపంచ సుందరీమణులు మహబూబ్‌నగర్ జిల్లాలోనిచారిత్రాత్మక పిల్లల మర్రి పర్యటన క్షేత్రాన్ని సందర్శిస్తున్న నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ డి. జానకి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ శివేంద్ర ప్రతాప్, అదనపు కలెక్టర్ రెవెన్యూ మోహన్ రావు తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. 22 దేశాల సుందరీమణులు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పిల్లల మర్రి పర్యాటక కేంద్రాన్ని చేరుకుంటున్న నేపథ్యంలో వారికి స్వాగతం పలకడం, పిల్లల మర్రిలో ఏర్పాటు చేసిన చారిత్రకకళాఖండాలు, శిల్ప కళలను తిలకించడం, దాదాపు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి, చిత్రంలో ఎస్పీ జానకీ, డీఎఫ్‌వో



మ్యూజియాన్ని సందర్శించిన కలెక్టర్

మూడున్నర ఎకరాల్లో విస్తరించి ఉన్న మర్రి చెట్టు విశిష్టతలను సుందరీమణులకు వివరించేందుకు ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు పై సంబంధిత శాఖల అధికారులను దిశా నిర్దేశం చేశారు. ప్రపంచ సుందరీమణుల పిల్లల మర్రి పర్యటన అత్యంత ఆహ్లాదకరంగా సజావుగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ ప్రపంచ సుందరిమణుల పర్యటనకు వెయ్యి మంది పోలీస్ సిబ్బందితో బందోబస్త్‌ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్.పి.రాములు, డి.ఎఫ్.ఓ సత్యనారాయణ, మున్సిపల్‌కమిషనర్‌మహేశ్వర్ రెడ్డి, ఆర్.డి. ఓనవీన్, డి.ఈ.ఓప్రవీణ్ కుమార్, ఇతరజిల్లాఅధికారులు పాల్గొన్నారు.

# పియు అధ్యాపకునికి పోస్ట్ డాక్టర్ రీసెర్చ్ అవార్డ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 15 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం వృక్షశాస్త్రంలో పనిచేస్తున్నటువంటి డా. పి. శివకుమార్ సింగ్, కువెంపు విశ్వవిద్యాలయం, శివమొగ్గ కర్ణాటక రాష్ట్రం నుండి పోస్ట్ డాక్టర్ రీసెర్చ్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా పాలమూరు వీసీ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ డాక్టర్ సింగ్‌ను గురువారం అభినందించారు. ఈ విధమైన పోస్టు డాక్టర్లు రీసెర్చ్ చేయడం వల్ల విశ్వవిద్యాలయ ఖ్యాతి భారతదేశంతో పాటు ఇతర దేశాలకు వ్యాపిస్తుందని కొనియాడారు. డాక్టర్ సింగ్ ఈపిడిఆర్‌లో నారాయణపేట జిల్లాలోని వేప చెట్లపై వచ్చే దైవ తెగులును గూర్చి మూడు సంవత్సరాలు పరిశోధన చేశారు. వేపచెట్ల డై బ్యాక్ వ్యాధి కారకాన్ని వేరుచేసి పూణేలోని పరిశోధన సంస్థకు పంపించి దాని జన్యుపరమైన పరిశోధనలు చేస్తున్నారు. ఈ



శివకుమార్ సింగ్‌ను అభినందిస్తున్న పియు రిజిస్ట్రార్ శ్రీనివాస్

పరిశోధన ఫలితంగా వేప చెట్లకు వచ్చే డై బ్యాక్ వ్యాధికి గల కారణాన్ని దానిని నిర్మూలించే విధానానిపై వీరు సలహా ఇచ్చారు. ప్రొ॥ హెచ్‌సి శ్రీశైలం పర్యవేక్షణలో ఈ పిడిఆర్‌ను పూర్తి చేశారు. డాక్టర్ సింగ్ ఇప్పటికే సుమారు 50కి పైగా పరిశోధన పత్రాలను ప్రచురించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అసోసియేట్ ఫెల్లోగా కూడా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.రమేష్ బాబు ప్రిన్సిపల్ డాక్టర్ డి. మధుసూదన్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

# చిన్నారులకు పోషకాహారం అందించాలి

### - జిల్లా న్యాయ సేవ సమితి కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఇందిర



అవగాహన కల్పిస్తున్న ఇందిర

**మహబూబ్‌నగర్, మే15, ప్రభాతవార్త:** కుటుంబానికి ఆరోగ్యపరంగా ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్స్ ప్రముఖంగా ఉంటారని, చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించే బాధ్యత మీపైనే ఉందని జిల్లా న్యాయ సేవ సమితి కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ ఇందిర అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని పాత దవాఖాన కుమ్మరీ వాడి, అర్బన్ హెల్త్ సెంటర్ ఏరియాలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు పిఎల్‌వి రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్యవివాహాలు, వృద్ధుల సంరక్షణ తదితర సమస్యలపై తాము లీగల్‌గా తమవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. స్థానిక సమస్యలు, ఇబ్బంది పడుతున్న వ్యక్తులు సంప్రదించినప్పుడు సమస్యలను జిల్లా న్యాయ సేవా సహకార సంస్థకు అందిస్తే వారికి తక్షణమే న్యాయ సేవలు అందించేందుకువీలవుతుందన్నారు. చిన్నారులు వృద్ధులు మహిళలు ఎవరికైతే న్యాయ సహాయ సహకారం, రక్షణ, సంరక్షణ జీవనోపాధి కోసం అవసరమున్న వ్యక్తులకు జిల్లా న్యాయ సేవా సమితి నుంచి ఉచిత న్యాయ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం విద్యా పరంగా చిన్నపిల్లలకు తగిన సమయంలో పోషకాహారులు అందించిన వారిలో ఎదుగుదల మానసికంగా శారీరకంగా ఎదుగుదల ఉందని దానికి మీరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ కోఆర్డినేటర్ లలితా, డాక్టర్ శివకుమార్, పిఎల్‌వి చంద్రశేఖర్, వన్ టౌన్ ఎస్ఐ సీనయ్య, జర్నలిస్టు రాము, ఆశా వర్కర్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు .

# సీఎం సహాయ నిధి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



**గద్వాల, మే 15, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల టౌన్ 31వవార్డ్ లింగంబాగ్ కాలనీ చెందిన నామాల భారతమ్మకు చికిత్స నిమిత్తం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమో హన్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయం నిధి క్రింద 44,000 వేల రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, పిఏసీ ఎస్ ఛైర్మన్ వెంకటేష్, మాజీ కౌన్సిలర్స్ నరహరి శ్రీనివాసులు, దౌలు నాయకులు రామాంజనేయులునాగేంద్రయాదవ్, దౌలన్న, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.